# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఇటలీలో జరుగుతున్న జీ 7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు ద్వైపాక్షిక సమావేశాలలో పాల్గొన్నారు.**

**2.** **భారత్ తన మిత్రదేశాలతో స్నేహపూర్వకంగా వుంటూ, పరస్పర ప్రగతి సాధించేందుకు కృషి చేస్తోందని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.**

**3.** **పాలనా పరంగా పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన మంత్రులకు దిశానిర్దేశం చేశారు.**

**4.** **తెలంగాణలో ధరణి పోర్టల్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.**

**5.** **ప్రముఖ తెలుగు కవి, అభ్యుదయ కవితా ప్రయోక్త, శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతి ఈరోజు.**

==========================

ఇటలీలోని అపులియాలో జరుగుతున్న జీ 7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు ద్వైపాక్షిక సమావేశాలలో పాల్గొన్నారు. నిన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో మోదీ సమావేశం అయ్యారు. రక్షణ, అణు, అంతరిక్షం, విద్య, వాతావరణ చర్యలు, డిజిటల్, ప్రజా మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంస్కృతి వంటి రంగాలతో సహా పరస్పర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు.జీ 7 సదస్సు సందర్భంగా ప్రధాన మంత్రి నరేందరమోదీ బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునక్‌తో కూడా సమావేశమయ్యారు. జీ7 నాయకులతో పాటు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధుతో నరేంద్రమోదీ ద్వైపాక్షిక సమావేశాలు, చర్చలు జరిపారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్ స్కీ తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమై ఉక్రెయిన్ పరిస్థితిపై సమీక్ష జరిపారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతియుతంగా వివాదం పరిష్కరించుకోవాలని భారత్ ఆశిస్తోందని ప్రధానమంత్రి తెలియజేశారు.

--------------------------

భారత్ తన మిత్రదేశాలతో స్నేహపూర్వకంగా వుంటూ, పరస్పర ప్రగతి సాధించేందుకు కృషి చేస్తోందని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత నావికాదళ కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించేందుకు నిన్న విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ను ఆయన సందర్శించారు. వరుసగా రెండవసారి రక్షణ శాఖ

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రాజ్నాథ్ సింగ్ మొదటి పర్యటన 'డే ఎట్ సీ' లో భాగంగా ఐఎన్ఎస్ జలశ్వ యుద్ధనౌకలో బయలుదేరారు. ఈ సందర్భంగా, ఆయన వివిధ నౌకలు, జలాంతర్గామి, కమాండ్ విమానాల ద్వారా డైనమిక్ కార్యకలాపాలను వీక్షించారు. సమీక్ష అనంతరం రాజ్నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సముద్ర భద్రతను మరింత పటిష్టం చేసేందుకు దృష్టి కేంద్రీకరిస్తున్నామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కల్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రిగా నియమించడంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం,శాస్త్ర సాంకేతిక విజ్ఞానం శాఖల భాధ్యతలు అప్పగించారు. నారా లోకేష్‌కు మానవ వనరులు అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖలు, అచ్చెన్నాయుడుకు వ్యవసాయశాఖ, పొంగూరు నారాయణకు పురపాలక, పరిపాలన పట్టణాభివృద్ధి శాఖలు కేటాయించగా, హోంశాఖ మంత్రిగా వంగలపూడి అనిత, ఆర్థిక శాఖా మంత్రిగా పయ్యావుల కేశవ్ లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మంత్రుల్లో జనసేన పార్టీకి చెందిన నాదెండ్ల మనోహర్‌కు పౌర సరఫరాలశాఖ, కందుల దుర్గేష్‌కు పర్యాటకశాఖ కేటాయించగా, బిజెపి ఎంఎల్ఎ సత్యకుమార్ యాదవ్ కి ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం శాఖను కేటాయించారు.

మరోవైపు మంత్రులకు శాఖల కేటాయింపు అనంతరం పలువురు మంత్రులు, తెలుగుదేశం సీనియర్ నాయకులు, సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి శాఖల కేటాయింపుపై ధన్యవాదాలు తెలిపారు. మంత్రి వర్గం కూర్పు చేసిన విధానాన్ని చంద్రబాబు వారికి వివరించారు. మంత్రివర్గంలో లేని వారి సేవలను మరో రూపంలో వినియోగించుకుంటామని తెలిపారు. మంత్రులుగా సమర్థవంతంగా పనిచేయాలని ప్రతి రోజు సచివాలయానికి రావాలని సూచించారు. శాఖలపై పట్టు పెంచుకోవాలని, పాలనా పరంగా పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

---------------------------

పార్లమెంట్‌లో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని వైసీపీ పార్లమెంట్ సభ్యులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైసీపీ పార్లమెంట్ సభ్యులుతో నిన్న జగన్మోహన్ రెడ్డి సమావేశమై, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు ఉన్న పరిస్థితులు తాత్కాలికమేనని, ప్రజల సమస్యలను పార్లమెంట్ లో ప్రస్తావించాలని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ తరఫున పార్లమెంటరీ నేతగా వైవీ సుబ్బారెడ్డిని ఎన్నుకుంటున్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాజ్యసభలో పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి, లోక్‌సభలో పార్టీ నాయకుడిగా మిథున్ రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

---------------------------

తెలంగాణలో ధరణి పోర్టల్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.నిన్న హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలోని ధరణి కమిటీ సభ్యులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, భూముల సమస్యల నుంచి ఉపశమనం కలిగించేందుకు ధరణి పోర్టల్‌ను పునర్వ్యవస్థీకరించనున్నామని చెప్పారు. భూ వివాదాల పరిష్కారం కోసం

రెవెన్యూ ట్రైబ్యునల్‌లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించినట్లు చెప్పారు. ధరణి పోర్టల్‌ను బలోపేతం చేయడంతోపాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా, అందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా మార్పులు చేపట్టబోతున్నట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

రైతు భరోసా పథకం కింద అర్హులకే పెట్టుబడి సాయం అందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో నిన్న జరిగిన జడ్పీ సమావేశంలో రైతు భరోసా పథకంపై పలువురి సందేహాలను మంత్రి నివృత్తి చేశారు. త్వరలోనే రైతు సంఘాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు స్వీకరించి, శాసనసభలో చర్చించి విధివిధానాలు రూపొందిస్తామని స్పష్టంచేశారు. సాగు చేసే వారికే పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. వీటన్నింటిపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టత ఇస్తుందని ఆగస్టు 15 నాటికి 2 లక్షల రూపాయల పంట రుణమాఫీ అమలుకు కట్టుబడి ఉన్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయవ్యవస్థ స్థానంలో నూతనంగా రూపొందించిన మూడు నేర చట్టాలు ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి, నేరశిక్షా స్మృతి, భారత సాక్ష్యాధార చట్టం 1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికత సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలను ప్రవేశపెట్టారు. పార్లమెంటు ఆమోదం అనంతరం గత ఏడాది డిసెంబర్ 25న రాష్ట్రపతి సంతకంతో అవి చట్ట రూపం దాల్చాయి. ఈ నూతన నేరచట్టాల ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన నూతన నేర చట్టాలపై ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో గ్రూప్-2 సర్వీసుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాల్లో తప్పులను సవరించుకునేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –టీజీపీఎస్సీ అవకాశం కల్పించింది. సవరణలకు ఎడిట్ ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ అవకాశం రేపు ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అవకాశం ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది.

---------------------------

తెలంగాణలో 2024-25 విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నతాధికారులు నిన్న ఈ ఫలితాలను విడుదల చేశారు. 91.92 శాతం ఉత్తీర్ణతతో 71 వేల 647 మంది విద్యార్థులు ఐసెట్ లో అర్హత సాధించారని అధికారులు తెలిపారు విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాల్ని నమోదు చేసి ర్యాంక్ కార్డుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

---------------------------

ప్రముఖ తెలుగు విప్లవకవి, అభ్యుదయ నవయుగ కవితా ప్రయోక్త శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతి ఈరోజు. 1910 ఏప్రిల్ 30వ తేదీన విశాఖపట్నంలో జన్మించిన శ్రీశ్రీ... అభ్యుదయ భావాలతో తెలుగు సాహిత్యంలో అద్భుతమైన కవితా సంకలనాలతో పాటు.. చలన చిత్ర గీతాలను, రేడియో నాటికలను రచించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో అనర్ఘరత్నం వంటి మహా ప్రస్థానాన్ని శ్రీశ్రీ రచించారు. తెలుగు సాహిత్యపు దశ, దిశను మార్చిన పుస్తకంగా మహా ప్రస్థానం ప్రసిద్ధి గాంచింది. అల్లూరి సీతారామరాజు సినిమా కోసం 1974లో శ్రీశ్రీ రాసిన "తెలుగు వీర లేవరా" అనే పాటకు జాతీయ పురస్కారం లభించింది. సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక మహాప్రస్థానాన్నే సృష్టించుకొని 20వ శతాబ్దపు ఆధునిక తెలుగుకవితకు చుక్కానిగా నిలిచిన శ్రీశ్రీ 1983 జూన్ 15 న తుది శ్వాస విడిచారు.

=======================